అదొక మహానగరం.

ఆ నగరానికో మారుమూల - మురికివాడలని పిలువబడే ఒక వాడలోని వొక వీధి.

వీధంటే విశాలమైన నున్నటి సిమ్మెంటు రోడ్డుతో విరాజిల్లే వీధి కాదది.

మోకాటి లోతు బురద గుంటలతోనూ, కుళ్ళు కాలవలతోనూ నిండిన సన్నని వంకర టింకర మట్టిరోడ్డుతో అలారారే సందు మాత్రమే. నియాన్ లైట్లతో పట్టపగల్లా - దీపావళిలా వెలిగిపోయే రోడ్డు కాదది. తిమిరావళి మాత్రమే ప్రకాశిస్తుందక్కడ. ఎత్తయిన చూడముచ్చటయిన భవంతులు లేవక్కడ. కాసేపట్లో పోయే రోగుల ప్రాణాల్లా మినుకు మినుకుమనే కిరసనాయిలు బుడ్ల చిరు వెలుగుల్ని వుండుండి దజల్లుతున్న పూరిగుడిసెలు మాత్రమే ఉన్నవక్కడ. ఖరీదయిన కార్లూ, స్కూటర్లూ పరుగులు తీయవక్కడ. అస్థిపంజరాల్లా బక్కచిక్కిన బడుగు ప్రజలూ, పందులూ, కుక్కలూ మాత్రమే విహరిస్తుంటాయి. రేడియోల, టేప్‌రికార్డర్ల సంగీతాలు వినిపించవక్కడ. జుమ్మనే ఈగలూ, దోమల మధుర మంజుల గానాలే శ్రవణపేయంగా వినవస్తాయక్కడ.

రాత్రి పదిగంటల సమయం. లొల్లాయి పదం పాడుకొంటూ వచ్చి గుడిసె ముందు రిక్షా ఆపేడు గోపన్న. రిక్షా సీటు పైకెత్తి లోనున్న ఒక కాగితం పొట్లాన్నీ, వొక పొడుగాటి సీసాను తీసుకొని లోనికి ప్రవేశించాడు. ఆ గదిలోని నేల మీద చలికిబలికి ఉన్నాయి రెండు మానవాకారాలు - ఒక ఆడ, ఒక పిల్లాడూనూ. ఒక మూలనున్న కుక్కి నులక మంచం మీద మరో ముసలమ్మ పడుకొని ఉంది. దీపం పెద్దది చేసి పరీక్షగా చూడకపోతే నల్లరంగు పూసిన మానవ కంకాళాన్ని పరుండబెట్టి పుర్రెకొక ఎండిపోయిన వెలవేసిన చీపురు కట్టినట్లు భ్రమించడం తథ్యం.

''కూరేవొండినావే లచ్చీ?'' అడిగేడు గోపన్న తానూ వాళ్ళ సరసన కూర్చుంటూ.

''ఏవొండుతాను? నువ్వు తెచ్చి పడేసిన అరకోడి కూరొండి, బొచ్చిచేప పులుసెట్టి నాను కాదంటావా? అయ్యో బాగ్గెం, తినీ కుడిసే బొట్టోడునానడమైనా లేదు. ఎంత పున్నెం సేసుకున్నాడో ఆడు నీ కడుపును ట్టేడు. మా జనమలకి రోజూ గంజి మెతుకు లేగందా'' అంది లచ్చి గోపన్న భార్య.

నులక మంచం కిర్రుమంది.

''ఒరి గోపిగా పిల్లోడు కోడికూరం తన్నాడూ, ఓ కోడి తేరా అని నాత్రో జుల్పుం చి మొత్తుగుంతన్నాను గందా, తెచ్చినావా?'' అడిగింది ముసలి మంగమ్మ - గోపన్న తల్లి - వారి వైపు తిరుగుతూ.

''రేపట్టుకొత్తలేవే. నువ్వన్నం తిన్నావా అమ్మా?''

''తిన్నాన్నాయనా''

''నీకు చుట్టముక్కలట్టు కొచ్చినానే యమ్మా'' అంటూ కాగితం పొట్లాం తల్లి కందించేడు.

ఆ పొట్లాన్ని గాఢంగా వాసన పీల్చి ''మాబాబే లంకాకు సుట్టలే అట్టుకొచ్చినావు. మా కమ్మటి వాసనేత్తన్నాయిరా'' అంది. మంచం మరల కిర్రుమంది.

గ్లాసు నిండా తాను తెచ్చిన సీసాలోని తెల్లని ద్రవాన్ని నింపి గడగడ తాగేసాడు గోపన్న.

''కూరకీ నారకీ డబ్బులు వుండవు గాని ఈ దిక్కుమాలిన కల్లుకు మాత్రం యేడనుంచొత్తాయో?'' అంది లచ్చి.

చిరిగిన నిక్కరు వేసుకొన్న అయిదేళ్ళ పిల్లాడు తండ్రి వంక ఆశగా చూడసాగేడు మిలమిల్లాడుతున్న కళ్ళతో. సీసాలో మిగిలిన కొంచెం కల్లును గ్లాసులోకి పోసి -

''ఈ కొంత సుక్కేసుకోరా సత్తిగా'' అని పిల్లాడికి అందివ్వబోయాడా గ్లాసు.

''నీకేమన్న మతోందేట్రా మావా? గుంటడికిత్తన్నావేటి కల్లు? ఆడు గూడ నీలాగే తాగుబోతవ్వాలనేటి? నిసా బాగా తలకెక్కిపోనాది గాబోలు'' అంటూ ఆ గ్లాసును లాక్కోబోయింది లచ్చి.

నీకు పున్నెముంటాది కాని ఆడికా పాడు తాగడలవాటు సేయకు''

''ఏవే ఇది పాడు తాగుడా? కాదే నాలాటి కట్టజీవులకి వొరప్పసాదమే. దీని సంగతి నీకేవెరిక? ఒరి సత్తిగా దాని మాటలకేం గాని తాగెయ్యరా'' అని తిరిగి వాని చేతిలో పెట్టబోయాడు.

గ్లాసును ఒక్కుదుటున లాక్కొని ''ఆడికిది జనమలో మళ్ళీ ఇచ్చేవంటే నన్ను సంపుకు తిన్నంతొట్టు. ఆడినీ నీలా కూలోడ్ని సేద్దామనుకుంటన్నావా? అదేం కుదర్దు. అణ్ణి సదివించాలి. బాగా సదుకొని, పెద్ద దొరబాబులా వుద్దేగం సేత్తాడు నా బాబు. మావా, మనకున్నోడీడొక్కడే గందా. ఆ పాత్రం సదివించలేమా?''

గోపన్న నిర్ఘాంతపోయాడు. అవాక్కయి చలనరహితంగా కాస్సేపట్లే వుండిపోయాడు.

''ఔను మావా, మనమెల్లకాలం యిలా పూరిగుడిసెల్లోనా కుళ్ళు కాలవల్లోనూ పురుగుల్లా బతకవలసిందేనా? ఎంత కట్టపడైనా సదివిద్దాం. యీడి మీదనే నా ఆసల్ని పెట్టుకొని బతుకుతున్నాను మావా'' అంటూ బావురుమని గోపన్న హృదయానికి హత్తుకుపోయింది.

గోపన్న లచ్చి తల నిమిరి; ''పిచ్చిదానా, సదూకోడం, వుద్దోగాలు సెయ్యడం మంచిది కాదంటం లేదే. కాని... కాని...'' అంటూ ఆగిపోయాడు ఏదో ఆలోచించుకుంటూ.

''నీ బయమేటో నాకెరికే మావా. అందరూ నీ తమ్ముడు లాగే వుంటారేటి? మన బాబు బంగారంండి. ఆడు బాగుపడి మనల్ని సుకపెట్టి మన కులానికే పేరు తెత్తాడు. గోపన్న మరో బీడీ ముట్టించి నేల మీదే వెల్లకిలా పడుకున్నాడు.



సత్తిగాణ్ణి సదివిత్తా

— ఇందిరా నారాయణ

'సత్తిగాడు' నిద్ర భారంతో జోగుతూ తల్లి మీద తలవాల్చి పడుకున్నాడు.

★ ★ ★

రెండు కల్లు సీసాలు రెండు చేతుల్తోనూ పట్టుకొని వూపుకొంటూ గుడిసెలో అడుగుపెట్టేడు సెంద్రన్న.

భార్య మంగి ఇద్దరు కొడుకులకూ అన్నం పెడుతోంది.

''ఓ యబ్బో, సేపల పులుసొండిసినావేవే మంగీ. గుమగుమలాడిపోతంది?'' అంటూ చెక్కలూడిపోయిన కావిడి పెట్టి మీద కూర్చున్నాడు.

''ఓరబ్బో. నువ్వు కొనుక్కొచ్చిన సేపలు. సందేల దాకా సూసి కూరేమిలేదని నానే యెల్లి రెండెండి పరిగిలు తెచ్చి పులుసెట్టినాను. సిన్నగుంటడు సెలవలకింటి కొచ్చినాడు గందా కూరా నారా తేవాలన్న గేనం యెక్కడేడిసింది?''

''పొరొద్దామనే సూసినానే కాని బేరం తగలడంవల్ల వుండిపోనాను. రేపు మంచి సేపతెత్తాలేవే. యేదీ, ఆ గలాసిటెయ్యి. యెండి సేపల పులుసూ్సత్తుంటే నోరూరిపోతంది. ఇది గటగట తాగేసి నానూ కూడూ తినేత్తాను. మాసెడ్డాక లేత్తంది''

''యే సెండాలం సూసినా నీకు నోరూరి పోద్ది మరి. కాని మన సూర్రింగాడు సీ సీ యెదవ కంపూ అంతన్నాడు'' అంది మంగి గ్లాసు భర్త కందిస్తూ.

''ఒరోరి సూరిగా దానికేంరా? బెమ్మాండంగా ఉంతది. ఆట్టలు మెతుకులు వొంటబట్టినాయేట్రా నాయనా సీసీ, తూతూ అంతన్నావు?'' అంటూ గ్లాసు నింపుకొని గబగబ తాగేశాడు.

మరో గ్లాసు కాళీచేసి మిగిలిన దాంతో మరల గ్లాసు నింపేడు. ''యీ సుక్కేసుకొని తిన్రా బాబూ. అప్పుడు అమురుతం నాగుంతది కూర'' అన్నాడు గ్లాసును సూర్యాని కందజేయబోతూ.

''ఒరి నీ జిమ్మడ. ఆడికిత్తావేట్రా? పెద్దోణ్ణేలాగా నీలా తయారుసేసినావు. సిన్నోడికి గూడ మప్పుతావేటి? అసలు నీకేమున్న బుద్దుందా? అట్టుకట్టాలు పడి ఆట్టల్లో వుండి సదూకొంటన్నోడికి కల్లిత్తావా? నువ్వు మడిసివా పశువ్వా?'' అంది మంగమ్మ గ్లాసుకు తన చేయి అడ్డంపెట్టి క్రోదారుణ నేత్రాల వెంట అగ్నిజ్వాలలు విరజిమ్ముతూ.

''ఏటే? ఏటన్నావు నేను మడిసిని కానా? ఔనే నేను మడిసినెలా అవుతాను? వొంట్లో వోపికనేకపోయినా పెళ్ళాం పిల్లలెక్కడ పత్తులుంటారోని పేనాలుగ్గ బెట్టుకొని సెమట్లు కారుసుకుంటూ రిచ్చా తొక్కి పైసలు నీ సేతుల్లో పోత్తన్నోడు మడిసెలా అవుతాడే? సేతికందొచ్చిన సినకొడుకుని - నా కట్టానికి సాయంగా నాలుగు రాళ్ళు తేవల్సినోన్ని సదివిద్దాం, వూళ్ళేలిద్దాం, అని నువ్వు పోరెడతంటే పోనీలే అందరి బతుకులు నాలాగే యెందుకు సెయ్యాలి అని సెమటోడిసి సంపాదించిన సొమ్ము ఆడికే కరుసు పెడతన్నోడు పశువేనే - మడిసెలాగౌతాడు? నా దగ్గు ఆయాసానికి డాట్రుబాబు మందుర్రాసిత్తే మందులు కొనేత్తే బువ్వేలరా బగమంతుడా అని అలాగే కట్టపడతన్నోడు మడిసెలాగౌతాడే మంగి మారానా?'' అని చుట్ట వెలిగించుకొని దాని చివర కసిదీరా కొరికి తుపుక్కున వూసేసాడు.

''యీ కల్లు సీసాలు మానేత్తే మందుర్లావేంటీ? ఓల్లే పేనాలు తీసే యీ మందుక్కరుసు పెట్టాలి గాని పేనాలు నిలిపే మందులు నీకెందుకు? సేసుకున్నందుకు పెల్లానికీ, కన్నందుకు పిల్లలకీ కూడెట్టడం గూడ వో బెమ్మవిద్దిగా సెప్తున్నావేంటీ? ఆకాడికి సదువంతా నువ్వే సెప్పించేత్తన్నావా? ఊరోళ్ళకాడ పాసి పన్లు సేసి సంపాయించిన పైసలు నేను పెట్టడం నేదా? పేరుకది ఆట్టలయినా రోజూ ఆ సాంబారూ కూడు తినలేడనే గందా కూరట్టికెల్లి ఇత్తన్నానూ? తోటోల్లలో యీనం వుండకూడదనే గందా బట్టలు కుట్టిత్తన్నాం? అయినకాడికి భారమంతా నువ్వే మోసేత్తన్నట్లు సెప్తావేవి? అసుమంటోడివి పెళ్ళెందుకు సేసుకోవాలి, పిల్లల్నెందుకు కనాలియంట?'' చేతులూపుతూ ఉద్రేకంగా మంగమ్మ నోరెత్తి దుయ్యబడుతూంటే సెంద్రన్న ఆవేశం చల్లారిపోయింది.

''ఒసొల్లుకోవే నోరిప్పితె పురానం యిడేత్తావు. పోనీ యీ కాంతా నువ్వు తాగెయ్యిరా గోపీ'' అంటూ గోపన్న కందించేడా గ్లాసు.

★ ★ ★

సూర్యం టెన్త్‌క్లాసు ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు. ఆ తల్లిదండ్రుల హృదయాలు ఆనంద పరవశమయ్యాయి. ఇద్దరూ వెళ్ళి స్కూలు మాస్టర్లకూ, హాస్టల్ అధికార్లకూ దండాలు పెట్టి తమ కృతజ్ఞతలు వెల్లడి చేసుకున్నారు.

సూర్యం చాలా తెలివయిన కుర్రాడనీ, ఇంకా చదివిస్తే తప్పక వృద్ధిలోకి రాగలడనీ నొక్కి చెప్పేరు వారంతా. చంద్రన్నా, మంగమ్మలు చెదిరిపోయి తమ అసక్తతను విన్నవించుకున్నారు. స్కాలరుషిప్పూ, హాస్టలు సదుపాయాలూ ఎంతవరకు చదివినా వుంటాయనీ, వాటి బంగారు భవితవ్యాన్ని పాడుచేయవద్దనీ చెప్పడంతో వాళ్ళు సంతోషంగా అంగీకరించేరు.

కాలేజీలోనూ, షెడ్యూలు కులస్థుల హాస్టల్లోనూ సీటు దొరికింది. వారానికి రెండు మూడుసార్లయినా వెళ్ళి, సూర్యాన్ని చూసి మంచి చెడ్డలు విచారించి వస్తుండేవారా తల్లిదండ్రులు. మరింత కాయకష్టం చేసి తమ కడుపులు కట్టుకొని వాడి బట్టలూ మిగతా అవసరాలూ తీర్చేవారు.

గోపన్న ఆనందానికి అవధులుండేవి కావు. తన తమ్ముడు పెద్ద చదువులు చదువుతున్నాడనీ, కలెక్టరవుతాడనీ అందరితోనూ చెప్పుకొని మురిసిపోయేవాడు.

సూర్యం ఎం.ఎ ఫస్టు రాంకులో పాసయ్యేసరికి చంద్రన్నను పట్టుకు పీడిస్తున్న ఉబ్బసం తీవ్రరూపం దాల్చింది.

''మీ బాబును దర్మాసుపత్రిలో జాయిను సేయించినాను. ఒపాలొచ్చి సూడు బాబూ'' అని మంగమ్మ వెళ్ళి ప్రాధేయపడగా వచ్చేడు సూర్యం. చావుబతుకుల్లో వున్న తండ్రి మంచం పక్కన మౌనంగా నిలబడ్డాడు. ఆ మాత్రం దానికే చంద్రన్న పరమానందం పొందేడు. ఐ.యే.యస్ పరీక్షకు చదువుకోవాలంటూ వెంటనే వెళ్ళిపోయాడు.

తండ్రి పుస్థితికి విలపించడం గాని, కన్నీరు నింపుకోవడం గాని, కనీసం ''నాన్న యెలా ఉంది?'' అని తండ్రి మీద చేయివేసి ఆప్యాయంగా అడగడంగాని - యేమి లేకుండగనే రాయిలా నిలబడి, మొక్కుబడి తీర్చుకున్నట్లు వచ్చి వెళ్ళిపోయినందుకు మంగమ్మ మది దురపిల్లింది.

నగరానికి మారుమూల - పదిమైళ్ళవతల వున్న వాడి హాస్టలుకు తను కష్టపడి వెళ్ళినపుడంతా వాడు తనతో ప్రవర్తించే తీరుకు కొంతకాలంగా మంగమ్మ హృదయం గాయపడుతూనే ఉంది. తనను చూసి ప్రేమగానూ, ఆదరణగానూ మాట్లాడడు. వాడి తల్లి బీద రూపాన్ని వాడి సహాధ్యాయులు చూసి ఛీత్కరించుకుంటారేమోననీ, తన తల్లి మాటలు విని వారంతా అసహ్యించుకొంటారేమోననీ భయపడుతూ ముక్తసరిగా రెండు మాటలు మాట్లాడి తొందరగా తనను సాగనంపాలని చూసే వాడి నైజం ముల్లులా పొడుస్తున్నా మమకారం మరుగున దాచేస్తూ వచ్చింది. కాని ఈ రోజు దృశ్యం ఆమె మనసులో తుఫానునే రేపింది.

''ఓ సొల్లుకోవే పైకి బుడిబుడి రాగాలు తియ్యలేదనా? ఆడి మనసులో వుండదా దుక్కమంతా, పైకేడిత్తే నానూ నువ్వూ మరీ ఇదైపోతామనీ తనలో మింగేసేడే. ఆడికి పేమ లేదనుకొంతన్నావేటి? అని చంద్రన్న తన నూరడించినా అతని కళ్ళలోని దనను గుర్తించలేని అమాయకురాలేమీ కాదు మంగమ్మ. చంద్రన్న దీర్ఘరోగి అయ్యాడు.

తండ్రి మంచాన పడటంతో తండ్రితొక్కే రిక్షా తాను తొక్కుతూ సంసారాన్ని ఈదుకు రాసాగేడు గోపన్న. తండ్రి ప్రవర్తన బాధించినా ''సిన్నోడు ఆడికే వెరిక? సదూకొంటున్నోళ్ళని యిలాంటియ్యేం తెలుత్తాయిలే'' అని తనను తానే సముదాయించుకొనేవాడు.

చంద్రన్న పరిస్థితి మరీ క్షీణించింది. మరి బ్రతకడని డాక్టర్లు తేల్చి చెప్పడంతో భర్త కాళ్ళ మీద తలపెట్టుకొని గోడు గోడున విలపిస్తోంది మంగమ్మ.

ఆక్సిజన్ బుడగలు రబ్బరు గొట్టం ద్వారా చంద్రన్న ముక్కులోనికి ప్రవేశిస్తున్నాయి. గుండెల్లో గురక - నోటి వెంబడి నురుగు - ఉండీ లేనట్లున్న ఉఛ్వాస నిశ్వాసలు - గాజు కళ్ళలా తేజాన్ని కోల్పోయిన కళ్ళు - అస్థిపంజరం లాంటి శరీరం చూసి చలించిపోయాడు గోపన్న.

పది మైళ్ళు రిక్షా తొక్కేకన్న పరుగే మంచిదనుకున్నాడు తండ్రి పరిస్థితినంతా తమ్ముడికి వివరించి చెప్పేడు.

''యెలా ఇప్పుడు? నేను ఐ.యే.యస్ పరీక్ష పాసయినట్లూ, ట్రైనింగుకు వెంటనే రమ్మనీ ఈ వేళే టెలిగ్రాం వచ్చింది. ప్రయాణ సన్నాహంలో వుండగా నువ్వొచ్చేవు'' అన్నాడు ముఖం చిట్లించి.

అంతటి దుఃఖంలో కూడ గోపన్న సంతోషంతో తల మున్కలయ్యాడు. తమ్ముని కౌగిలించుకొని అభినందించేడు. ధూళి దూసరమై మాసి చిరుగులు పట్టి కంపు కొడుతున్న బట్టలతోనూ, చమటలు కారుతున్న వంటితోనూ గోపన్న అలా తనను కౌగిలించుకోగానే సూర్యం మనసులోనే అసహ్యించుకొన్నాడు.

''పోయే పానం, వొచ్చే పానంగా వుంది. ఓపాలొచ్చి ఆడి కంటబడితే ఆడి పానం యే దిగులూ లేకుండ యెల్లిపోద్దీ. ఆలిస్సెం లేకండ యెంటనే యెల్లి పోదువుగాని'' అని ప్రాధేయపడ్డాడు.

''ట్రెయిను టైమ్ అయిపోతోంది. ఇది దాటితే అక్కడ టైముకు చేరుకోలేను. యెలా మరి?''

జవాబు చెప్పలేక తిరిగి వచ్చేశాడు. ''ఈ టయానికే అన్నీ రావాలా'' అని విధిని నిందించుకొంటూ పరీక్ష పాసయ్యినట్లు తమ్మునికెప్పుడో తెలుసనిగాని, ట్రెయినింగుకు వెళ్ళేందుకు ఇంకా వ్యవధి వుందనిగాని యెలా తెలుస్తుందా అమాయక జీవికి?

''నాన్నా, నాన్నా తమమ్ముడు పరీచ్చ పేసయాడు. కలకటేరయిపోనాడు'' అని తండ్రి చెవి దగ్గర నోరుపెట్టి బిగ్గరగా పలుమార్లు చెప్పడంతో కళ్ళు విప్పేడు చంద్రయ్య. కళ్ళలో కాస్త మెరుపు. ముఖంలో కొంచెం ప్రఫుల్లత. సూర్యం కోసం చూపుల్ని నలుదిశలా సారించేడు.

''ట్రయినింగ్‌కెళ్ళేడు. కలకటేరుగా తిరిగొత్తాడు.

దీర్ఘంగా నిశ్వసించేడు. తృప్తిగా కళ్ళు మూసాడు - శాశ్వతంగా.

★ ★ ★

బంగళా దేదీప్యమానంగా వెలిగిపోతోం. రంగురంగుల విద్యుద్దీపాల తోరణాలతోనూ, షామియానాలతోనూ, కాంపౌండ్‌లో బారులు తీరి నిల్చిన కార్లతోనూ కన్నుల పండువలా ఉంది. ఇంద్ర భవనంలా ఉంది - షామియానాల క్రింద వరుసగా అమర్చిన టేబుల్స్ - వాటి మీద సీసాలు, గ్లాసులు, ప్లేట్లలో రకరకాల పదార్థాలు. పాశ్చాత్య సంగీతం మృదుమధురంగా వినవస్తోంది. కుర్చీల్లో పెద్ద ఆఫీసర్లూ, బడా పారిశ్రామికవేత్తలూ, ఘరానా పెద్దమనుషులూ, నాయకమ్మన్యులూ కూర్చొని, హుషారుగా తాగుతూ, తింటూ కులాసా కబుర్లు చెప్పుకొంటున్నారు.

(మిగతా 14వ పేజీలో..)